క్లుప్తంగా

పేదలకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న దృశ్యం

గారా: తల్లిదండ్రుల పేరిట సామాజిక కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. మండలంలోని శాలిహుండం పంచాయతీ కొంక్యాణపేట గ్రామంలో కొన్న చిన్నారావు, చిన్నమ్ముడుల జ్ఞాపకార్థం వారి కుమారుడు కొన్న వేంకటేశ్వరరావు వస్త్రదానం, అన్నదానం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు, గుండ భాస్కరరావు, కొంక్యాన ఆదినారాయణ, పూడి బాలాదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భగవద్గీత పోటీలు



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగవద్గీత పోటీలు ఆదివారం నారాయణ తిరుమలలో ఉత్సాహంగా జరిగాయి. ప్రోగ్రాం మేనేజర్ ఎం.లలితామణి ఆధ్వర్యంలో 6, 7 తరగతులకు 6వ అధ్యాయం ఆత్మ సంయమన యోగంపై, 8, 9, 10 తరగతులకు సంపూర్ణ భగవద్గీత పఠనంపై పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జి.వెంకటలక్ష్మీ, ఎం.శ్రీనివాసరావు, కైలాసరావు, కృష్ణమూర్తి, ఎస్.ధర్మారావు, దేవరాజులు వ్యవహరించారు. వీరిని విశ్రాంత హైకోర్టు జడ్జి గురుగుబిల్లి యతిరాజులు చేతుల మీదుగా సత్కరించారు. అలాగే విజేతలైన విద్యార్థులకు ఆలయ ప్రధాన అర్చకులు జి.శ్రీనివాసులు చేతులమీదుగా ప్రశంసా పత్రాలు అందించారు.

జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా సాయిరాం



రణస్థలంకు చెందిన జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గం సభ్యులు

రణస్థలం: జిల్లా అర్యవైశ్య నూతన కార్యవర్గం ఎంపికలో మండలంలోని జే.ఆర్.పురం ఎంపీటీసీ పచ్చిగుళ్ల సాయిరాంను జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. అలాగే జిల్లా కార్యవర్గ సభ్యులుగా జేఆర్‌పురానికి చెందిన పచ్చిగుళ్ల రవి, సుగ్గు కామేష్‌ని నియమించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అంబికా కృష్ణ, రణస్థలం మండల అధ్యక్షుడు పి.చంద్రశేఖర్, వడ్డాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


అగ్నిమాపక బాధితులకు సాయం



అగ్నిమాపక బాధితులకు సామాగ్రి అందజేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు గ్రామ యువత సహకారంతో స్థానిక సర్పంచ్ బూడారి లక్ష్మణరావు చేతుల మీదుగా ఫ్యాన్లు, కుర్చీలు, ఇతర సామాగ్రి ఆదివారం అందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు



జస్టిస్ సుబ్బారెడ్డిని కలిసిన న్యాయవాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి, జిల్లా పోర్టు పోలియో న్యాయమూర్తి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డిని నగరంలోని హోటల్ సన్‌రైజ్‌లో శ్రీకాకుళం జిల్లా న్యాయవాదులు, బార్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా ఆదివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ మరియు జిల్లా కోర్టు ఆవరణలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తిని కలిసినవారిలో జిల్లా బార్ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, అన్నెపు సత్యనారాయణ, న్యాయవాదులు, బార్ ప్రతినిధులు వాన కృష్ణచంద్, కె.ఆఫీస్ నాయుడు, మామిడి క్రాంతి, ఎం.అన్నం నాయుడు, బీఎస్ చలం ఉన్నారు.

కూరగాయలకు .. కేరాఫ్ అడ్రస్

- హోల్‌సేల్‌కు కేంద్రంగా ముత్యాలమ్మ కూరగాయల మార్కెట్
- వేకువజామున 3 నుంచి ఉదయం 8 గంటల వరకు విక్రయాలు
- వ్యాపారులతో పాటు రైతులకు ఉపయోగకరం



విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయల బస్తాలు

శ్రీకాకుళం: నగరంలోని హయాతీనగరంలో ఉన్న ముత్యాలమ్మ కూరగాయల మార్కెట్ హోల్‌సేల్ విక్రయాలకు కేంద్రబిందువుగా మారింది. సుమారు 20 ఏళ్ల క్రితం ఈ మార్కెట్‌ను కొందరు వ్యాపారాలు కలిసి ప్రారంభించగా.. దినదినాభివృద్ధి చెంది హోల్‌సేల్ కూరగాయల క్రయవిక్రయాలకు పేరుపొందింది. ఈ మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసి వీధి వ్యాపారాలు, రైతు బజారులోని వ్యాపారులు లాభపడుతున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు యజమానులు సైతం ఇక్కడే కొనుగోలు చేస్తుండటంతో తక్కువ ధరకే కూరగాయలు లభిస్తున్నాయి. దీంతో ఆయా వర్గాల వారికి ఆదా కలుగుతోంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి కూరగాయలను దిగుమతి చేసుకొని ఇక్కడ హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. ఉల్లిపాయలు, వెల్లుల్లి వంటి వాటిని కొందరు ఇతర జిల్లాలకు చెందిన వర్తకులు కమీషన్ పద్ధతిలో వర్తకాలు సాగిస్తున్నారు. పరిసర ప్రాంతాల రైతులు నేరుగా వచ్చి ఇక్కడే విక్రయాలు చేపడుతుంటారు. ఇలా అన్ని వర్గాలకూ లాభదాయకంగా మారింది. మార్కెట్‌పై ఆధారపడి సుమారు వందమంది హమాలీలు జీవనోపాధిని పొందుతున్నారు. వీరు రాత్రి 12 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు పనిచేస్తూ రోజుకు రూ. 500 నుంచి రూ.800 వరకు సంపాదిస్తున్నారు.

సౌకర్యాలు కరువు..

ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మార్కెట్‌లో నగరపాలక సంస్థ కనీస సౌకర్యాలను కల్పించడం లేదు. దీంతో కొంతమేర ఇబ్బందులు ఎదరవుతున్నాయి. చెత్త పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతుండగా పలువురు వర్తకులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ దృష్టి సారించి పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

కమీషన్ పద్ధతిపై వ్యాపారం



ఇతర ప్రాంతాల నుంచి ఉల్లిపాయలు, వెల్లుల్లి తీసుకువచ్చి హోల్‌సేల్ ధరలకు శ్రీకాకుళంలో విక్రయిస్తున్నాం. ఇందుకు గానూ ఆ వ్యాపారులు కమీషన్ చెల్లిస్తారు. దీంతో నలుగురి నుంచి ఐదుగురు వరకు ఉపాధి పొందగలుగుతున్నాం.

– హేమంత్‌కుమార్, ఉల్లిపాయల వ్యాపారి

నేరుగా అమ్ముతున్నాం



పంటను మార్కెట్‌కు తీసుకువచ్చి నేరుగా అమ్ముకుంటున్నాం. వర్తకులకు అమ్మడం వల్ల తక్కువ మొత్తం వచ్చేది. ఇప్పుడు ఎక్కువ పొంది కొంత మేరలాభం పొందుతున్నాం.

– ధనుంజయరావు, రైతు, ఫరీదుపేట

హమాలీగా జీవనోపాధి



ముత్యాలమ్మ మార్కెట్‌లో హమాలీలుగా 100 మంది వరకు ఆధారపడి బతుకుతున్నాం. లారీల నుంచి సరుకు ఎగుమతి, దిగుమతితో పాటు వినియోగదారుల వాహనాల్లో బస్తాలను వేస్తూ ఆదాయాన్ని పొందుతున్నాం.

– రమణ, హమాలీ మేస్త్రీ

తక్కువ ధరలకే..



హోల్‌సేల్‌గా తక్కువ ధరకే ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేస్తున్నాం. దీనివల్ల ఒక్కో రెస్టారెంట్‌కు రోజుకు రెండు వందల నుంచి ఐదు వందల వరకు ఆదా కలుగుతోంది.

– మెట్ట నాగరాజు, రెస్టారెంట్ యజమాని

ప్రారంభమైన భగవద్గీత సప్తాహం



నరసింహమూర్తిని సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ఉపనిషన్మందిరం ఆధ్వర్యంలో గీతా జయంతి ఉత్సవాల్లో భాగంగా భగవద్గీత సప్తాహం ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిష్టల నర్సింహమూర్తితో భగవద్గీత–భారత గీత అనే అంశంపై ప్రసంగం జరిగింది. భగవద్గీత శ్రీకృష్ణునిచే గానం చేయబడిందని, అందులో భారత అనే పదం అనేక సార్లు అనడం వలన దీనిని భారతగీత అనవచ్చన్నారు. గీతలోని సారాన్ని గ్రహించి కొందరు విదేశీయులు ఎంతో అభివృద్ధి చెందుతున్నారన్నారు. ఈ సందర్భంగా వక్త నర్సింహమూర్తిని మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో పతంజలి శాస్త్రి, గుమ్మా నగేష్, కోమలరావు, మందుల మోహనరావు, నారాయణమూర్తి, బాపయ్యపంతులు, అరుణకుమారి, సరస్వతీ, లక్ష్మీ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కాల భైరవునికి విశేష పూజలు



కాల భైరవునికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం కల్చరల్: నక్క వీధిలో కాలభైరవుని అలంకరణ

గారా: శ్రీకూర్మం క్షేత్ర పాలకుడు కాలభైరవ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం కాలభైరవాష్టమి సందర్భంగా పండితులు భద్రం శ్రీనుబాబు, అర్చకులు కప్ప ఆనందరావుల ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నప్రసాదం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో మంగళవాయిద్యాల నడుమ ఉత్సవ మూర్తికి తిరువీధి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొనగా, కార్యక్రమంలో కింతలి హరీష్, వూడు రాజేశ్వరి, కప్ప లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్: నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసిన కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరణ చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

తెలుగు భాష అమృతభాష



సభలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు భాష అమృత భాష అని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో శ్రీకాకుళం సాహితీ ప్రముఖులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలుగు భాష మృత భాష కాదని, అమృత భాష అని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు భాషాభివృద్ధికి ఇచ్ఛాపురం నుంచి గడప గడపకి తెలుగు అనే కార్యక్రమం చేపట్టారు. శ్రీకాకుళంలో త్వరలో తెలుగు భాష సమ్మేళనం నిర్వహిస్తామన్నారు. 2026లో అమరావతిలో ప్రపంచ తెలుగు భాష సాహితీ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమితి కో–ఆర్డినేటర్ ఎల్.రవికుమార్, రమణమూర్తి, నిక్కు హరి సత్యనారాయణ, కె.వి.రాజారావు, తెలుగు రచయితల వేదిక ప్రధాన కార్యదర్శి ఆర్‌వీ రమణమూర్తి, రేజేటి వెంకటరమణమూర్తి, నటుడు మూల తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు



కేక్ కటింగ్ చేస్తున్న కమిటీ సభ్యులు

నగరంలోని చిన్న బజారులో ఉన్న తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. చర్చి నిర్వాహకుల ఆధ్వర్యంలో క్రైస్తవ గీతాలాపనలు, లఘునాటికలు, కేక్ కటింగ్, సందేశం, కేండిల్ సర్వీస్ జరిగింది. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. అలాగే మహిళా కళాశాల రోడ్డులో ఉన్న క్రిస్టియన్ వర్షిప్ కేంద్రంలో శ్రీకాకుళం మండల, అర్బన్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు ఆదివారం జరిగాయి.



లఘునాటిక ప్రదర్శిస్తున్న చిన్నారులు

ఈ సందర్భంగా సుమధుర క్రిస్మస్ గీతాలపనలు, సందేశం, కేక్ కటింగ్, క్యాండిల్ సర్వీస్ జరిగింది. కార్యక్రమంలో డీఎస్ వీఎస్ కుమార్, ఎం.పాల్సన్, ఆర్.ఎస్.జాన్, మాదారపు వెంకటేష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం కల్చరల్



గీతాలను ఆలపిస్తున్న దృశ్యం



క్రైస్తవ గీతాలు ఆలపిస్తున్న మహిళలు



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

వైద్య శిబిరాలకు మంగళం

- వైఎస్సార్‌సీపీ హయాంలో స్పెషలిస్టు డాక్టర్లతో సేవలు
- ఉచితంగా పరీక్షలు, మందులు సైతం పంపిణీ
- ప్రస్తుతం ఊసెత్తని వైనం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)

రణస్థలం:

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేవారు. దీనిలో భాగంగా నిపుణులైన వైద్యులు 14 రకాల జబ్బులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేసేవారు. అత్యవసర వైద్యసేవలు అవసరమైన వారిని సమీపంలోని ఆరోగ్యశ్రీ అమలవుతున్న వైద్యాలయానికి చికిత్స నిమిత్తం రిఫర్ చేసేవారు. దీంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేవి. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య సేవలను గాలికొదిలేయడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు దూరమైంది. దీంతో వైద్యం వారికి భారంగా మారింది.

పడకేసిన పల్లె వైద్యం

కూటమి ప్రభుత్వం ప్రజా ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంతో పల్లె వైద్యం పడకేసింది. ఆధునిక వైద్య సేవలకు పల్లె ప్రజలు క్రమేపీ దూరమవుతున్నారు. వ్యాధులొస్తే పట్టణాలకు పరుగులు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు విశేష కృషి చేసింది. ఇందుకు ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫార్సులను పంపేవారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకలు వంటి వివిధ రోగాలకు సంబంధించి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లోనూ పనిచేసే వైద్యులను జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలకు రప్పించి ప్రజలకు ఉచితంగా వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టారు. ప్రతీ శిబిరానికి సుమారు ఐదుమంది స్పెషలిస్టు వైద్యులతో పాటు స్థానిక ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి సాయంత్రం వరకు వైద్యసేవలు అందించారు. గుండెకు సంబంధించిన ఈసీజీ కూడా శిబిరంలోనే తీసేవారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రస్తుతం గ్రామాల్లో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. టైఫాయిడ్, మలేరియా, డెంగీ వంటి వ్యాధుల సోకి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. దీంతో గత ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాన్ని నిర్వీర్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలకు ఇబ్బందులు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు వైద్యానికి పెద్దపీట వేసింది. పంచాయతీల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి స్పెషలిస్టు వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉచిత నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు కూడా అందించారు. వైద్య శిబిరాలు పేదలకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఇప్పుడు వైద్య శిబిరాలు లేవు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

– గురాన తిరుమల మానస, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళ కార్యదర్శి

ఆదేశాలు లేవు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వంటివి ప్రబలితే వెంటనే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. 104 ద్వారా గ్రామాల్లో క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రత్యేక వైద్య శిబిరాల నిర్వహణపై ఇంతవరకు ఆదేశాలు లేవు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– యమున, రావాడ పీహెచ్‌సీ వైద్యురాలు

అన్నప్రసాద వితరణ



అయ్యప్పలకు అన్నప్రసాదం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బొంతావీధిలో ఉన్న శ్రీకృష్ణార్జున మందిరంలో అయ్యప్పలకు సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా శనివారం అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా వంది మంది అయ్యప్పలకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మిమిక్రీ శ్రీనివాస్, మందిరం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.